వాచుక్క ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified


: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 11 | 12-12-2022 | పుటలు : 4

## మంచి మాట

పని చెయ్యండి! పట్టువిడువవద్దు! ధైర్యంగా ఉండండి! దేన్నైనా ఎదుర్కోండి.

Work on! Hold on! Be brave! Dare any-thing and everything.

**- స్వామి వివేకానంద**




## అభినందన!

విశ్వవిద్యాలయఅభ్యున్నతికి
జరిగిన సాగర మథనం
దేవదానవ శక్తుల
సంఘర్షణ అహర్నిశం
NAAC విజయం
చదువుల తల్లికి
మీరిచ్చిన నీరాజనం!
వేదనను చిరునవ్వుమాటున
మీరు దాచిన వైనం
అది మహాశివుడు గళంలో
దాచిన కాలకూట గరళం!
ఇదే మీ స్థితప్రజ్ఞతకు
అకుంఠిత దీక్షకు తార్కాణం!
సార్థకం, అన్వర్థకం
జగన్నాథ నామధేయం!!



**- డాక్టర్ సల్మా**
**సెయింట్ థెరీసా కళాశాల, ఏలూరు**

# నన్నయలో జియోస్పేషియల్ టెక్నాలజీస్ అభివృద్ధి


**- వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**



జియోస్పేషియల్ టెక్నాలజీస్ ల్యాబ్ ను ప్రారంభిస్తున్న వీసీ
ఎంవోయు పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

ప్రపంచంలో అత్యంత వేగంగా జియోస్పేషియల్ టెక్నాలజీస్ అభివృద్ధి చెందుతుందని, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జియోస్పేషియల్ టెక్నాలజీస్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. గురువారం జియోసైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో "రిమోట్ సెన్సింగ్, జియోస్పేషియల్ ఇన్ఫర్మేషన్ సస్టమ్ (GIS), డిజిటల్ ఇమేజ్ ప్రోసెసింగ్ (DIS) ల్యాబ్ ను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రారంభించారు. తరువాత గరుడలిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, నన్నయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్ వర్మ, గరుడలిటిక్స్ సిఈఓ డా.వి.ఎస్.ఎస్.కిరణ్ లు ఎంవోయు పత్రాలపై సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ప్రపంచంలో జియోస్పేషియల్ టెక్నాలజీస్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. జియోస్పేషియల్ టెక్నాలజీస్ అవసరం ఎంతో ఉందని, రానున్న ఐదేళ్ళ కాలంలో భారత ప్రభుత్వం సుమారు నాలుగులక్షల యాభై వేలు ఉద్యోగాలు వస్తాయని భావిస్తుందని తెలిపారు. జియాలజీ, జియోఫిజిక్స్, సివిల్, కంప్యూటర్ సైన్స్, లైఫ్ సైన్సెస్ విద్యార్థులకు జియోస్పేషియల్ టెక్నాలజీస్ శిక్షణ ఇప్పిస్తే చక్కని ఉద్యోగాలు వస్తాయన్నారు. జియోస్పేషియల్ టెక్నాలజీస్ ప్రాధాన్యాన్ని గుర్తించి అన్ని రకాల వసతులతో నన్నయ జిఐఎస్ ల్యాబ్ ను ప్రారంభించడం జరిగిందన్నారు. గరుడలిటిక్స్ ప్రైవేటు లిమిటెడ్ తో ఎంవోయు కుదుర్చుకున్నామని చెప్పారు. ఎంవోయు ద్వారా నన్నయ విద్యార్థులకు జియోస్పేషియల్ టెక్నాలజీస్ లో శిక్షణ, ప్రోజెక్ట్ వర్క్స్, ఇంటర్న్ షిప్, ప్లేస్మెంట్స్ ఇస్తారన్నారు. ప్రతీ సంవత్సరం రెండు మూడు వారాల గురడలిటిక్స్ నుండి నిష్ణాతులు వచ్చి శిక్షణ కార్యక్రమాలు, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తారని తెలిపారు. గరుడలిటిక్స్, నన్నయ ఫ్యాకల్టీ కలిసి జాయింట్ రిసెర్చ్ ప్రోజెక్ట్స్, కన్సల్టెన్సి లు నిర్వహిస్తారని చెప్పారు. జియోస్పేషియల్ టెక్నాలజీస్ కు సంబంధించి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పెద్ద శిక్షణ కేంద్రంగా మారుతుందని తెలియజేసారు. నన్నయ విశ్వవిద్యాలయంలోని జియోసైన్సెస్ విద్యా ర్థులు, అధ్యాపకులు, పరిశోధకులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసు కోవాలన్నారు. అనంతరం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో "జియోస్పేషియల్ టెక్నాలజీస్ – ఉద్యోగావకాశాలు" అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాప్ లో గరుడలిటిక్స్ సిఈఓ డా.వి.ఎస్.ఎస్.కిరణ్ మాట్లాడుతూ భూవిజ్ఞన శాస్త్రజ్ఞునిగా జియోస్పేషియల్ టెక్నాలజీస్ అవసరత, ఆవశ్యకతలను బాగుగా తెలిసిన తన గురువు ఆచార్య మొక్కా జగన్నాథరావు నిత్యం విద్యార్థుల ఉన్నత కోసం కృషి చేస్తారని చెప్పారు. జియోస్పేషియల్ టెక్నాలజీస్ లోని వివిధ కేటగిరీలలో ఉద్యోగావకాశాలకు సంబంధించిన అంశాలను తెలియజేసారు. భవిష్యత్‌లో జియోస్పేషియల్ టెక్నాలజీస్ ఏ విధంగా అభివృద్ధి చెందుతుంది, దానిలోని అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవాలనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, ప్రోగ్రామ్ కన్వీనర్ డా.కె.నూకరత్నం, ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.కె.వి.స్వామి, డా.కె.ఎస్.పీటర్, డా.కె.సుధారాణి, డా.జి.అప్పారావు, డి.వి.తేజ, డా.ఎస్.వెంకటేశ్వరరావు, డా.పి.అరుణ్ కుమార్, డా.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథరావుగారి మార్గదర్శకంలో...



వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుగారి మార్గదర్శకంలో 2018లో ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పూర్తి చేసాను. జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో జియోస్పేషియల్ టెక్నాలజీస్ కు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి విద్యార్థుల ప్రయోజనార్థమై వీసీ జగన్నాథరావు గారు సూచన మేరకు నన్నయ విశ్వవిద్యాలయంలో గరుడాలిటిక్స్ సంస్థతో ఎంవోయు కుదుర్చుకొని జియోస్పేషియల్ టెక్నాలజీస్ ను అందించేందుకు ముందుకు వచ్చాను.ఈ ఎంవోయు ద్వారా జియోస్పేషియల్ టెక్నాలజీ ట్రైనింగ్, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సహకారం, జియోస్పేషియల్ టెక్నాలజీస్ కన్సల్టెన్సీ, ఇంటెన్షిప్ లకు సహకారం, వర్క్ షాప్స్, వెబినార్స్ నిర్వహణ, విద్యార్థులకు ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ప్రయత్నిస్తాం.వచ్చే మూడు సంవత్సరాలలో నాలుగు లక్షల ఉద్యోగావకాశాలు జియోస్పేషియల్ టెక్నాలజీస్ ద్వారా లభించనున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎం.ఎన్.సి కంపెనీలలో, యాపిల్, గూగుల్, నాసా, ఇస్రో, గతిశక్తి వంటి ప్రోజెక్టులకు జియోస్పేషియల్ టెక్నాలజీస్ ను ఉపయోగిస్తున్నారు. స్థానికంగా వై.ఎస్.ఆర్. జగనన్న భూహక్కు, సర్వే వర్క్స్ చేయడానికి ఈ స్కిల్ నేర్చుకున్న విద్యార్థులు అర్హత సాధించవచ్చు. నన్నయ విశ్వవిద్యాలయంలో "రిమోట్ సెన్సింగ్, జియోస్పేషియల్ ఇన్ఫర్మేషన్ సస్టమ్ (GIS), డిజిటల్ ఇమేజ్ ప్రోసెసింగ్ (DIS) ల్యాబ్ అభివృద్ధి చేసారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకుంటే మెరుగైన ఫలితాలను చూడవచ్చు.

**- డా.వి.ఎస్.ఎస్.కిరణ్, సిఈఓ - గరుడలిటిక్స్.**

## సంపాదకీయం



# ఆముక్తమాల్యద

పదహారవ శతాబ్దంలో రాజ్య పట్టాభిషిక్తుడైన విజయనగర ప్రభువు కృష్ణదేవరాయలు. ఆయన మనసు కరగిన మహా భక్తుడు.దేశ భాషలందు లెస్స అయిన తెలుగులో ఆముక్తమాల్యద కావ్యాన్ని రచించిన మహాకవి. గోదాదేవి శ్రీరంగనాథుని పెళ్లాడిన కథ అది. విలుపుత్తూరులో విష్ణుచిత్తుడు ఆమె నాయన. అందుకే ఆముక్తమాల్యద కావ్యాన్ని విష్ణుచిత్తీయం అని కూడా అంటాం. విష్ణుచిత్తుడు పెరియాళ్వార్.పురాకృత పుణ్యఫలితంగా పెద్ద భాగవతోత్తముడు.ద్రావిడ వేదానికి ప్రథమ మంగళగీతమైన చరిత్రను కృష్ణదేవరాయలు కావ్యంగా మలిచాడు.

గోదాదేవి శ్రీరంగనాథునిపై ప్రేమ పరవశంతో పాటలు పాడుకుంది. అవన్నీ ' తిరుప్పావై ' ప్రబంధాలయ్యాయి. అది ధనుర్మాస సంగీతం. శ్రీరంగనాథుని అలంకరించటానికి కట్టి బుట్టలో ఉంచిన పూలమాలికను తండ్రి చూడకుండా గోదాదేవి ధరించి బావి నీటిలో నీడను చూసుకుని సంతోషించేది. తాను ధరించిన పూలదండను సమర్పించేది కాబట్టి "ఆముక్తమాల్యద" అయింది. సాక్షాత్తు భూదేవి అంశ కాబట్టి ఆమె ధరించిన మాలికను ప్రేమతో స్వీకరించాడు శ్రీరంగడు. ఒకరోజు విష్ణుచిత్తుడు చూసి గోదాదేవిని మందలించాడు. ఆమె ధరించిన పూలదండ నాకు భోగ్యతరం అన్నాడు స్వామి. తనను కాపాడవచ్చిన కూతురు సాక్షాత్తు లోకజనని (ఆండాళ్) గా తండ్రి గమనించాడు.


' గళమున కట్టెను హరి మంగళసూత్రము ' గోదా శ్రీరంగనాథుల వివాహంతో ఏడు ఆశ్వాసాలతో 877 పద్యాలతో అది మహత్తరమైన ప్రబంధమైంది. తెలుగులో ఇంతకంటే ప్రౌఢమైన కావ్యంలేదు. విష్ణుచిత్తుడు, యామునాచార్య చరిత్రల రచనతో కృష్ణదేవరాయల వైష్ణవ భక్తి సంపత్తి మనకర్థమవుతుంది. వైష్ణవ భక్తులుగా ప్రసిద్ధులైన పన్నిద్దరు ఆళ్వారులలో విష్ణుచిత్తునితోపాటు గోదాదేవికి స్థానం లభించటం విశేషం!

ఈ కథ పాండ్య మండలం అందులోనూ విలుపుత్తూరు, మధుర, శ్రీరంగం, కురుంగుడి మొదలైన దివ్య క్షేత్రాలకు, దక్షిణ భారత సంస్కృతికి చెందింది. ఇక్కడి ఆచార ధర్మాలను, ప్రకృతిని ప్రతిబింబించింది.

నగర వీధులు, గ్రామాలు, రైతులు, వరిచేలు, తమలపాకు తోటలు, సంస్కృత ద్రావిడ భాషల ప్రజల ప్రయోగాలు, భవనాలు, సముద్ర యానం, లలిత కళలు, వేసవి చలి పందిర్లలో సరసాల భాష, తిరుణాళ్ళలో వడపప్పు పానకం... ఇలా నాటి ప్రజల జీవన విధానమంతా ఇందులో ఉంది.

కన్నడిగుడైన కృష్ణరాయుడు తెలుగును ప్రేమించి, ఆదరించి, కావ్యంగా రచించి చక్రవర్తిగా, మహాకవిగా తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వతుడయ్యాడు. కృష్ణరాయ ప్రభూ! జయీభవ! దిగ్విజయీభవ!!

**ధనుర్మాస శుభాకాంక్షలు!!**



మెకానికల్ అండ్ సివిల్ ల్యాబ్స్ ప్రారంభిస్తున్న వీసీ

# మెకానికల్ అండ్ సివిల్ ల్యాబ్స్ ప్రారంభించిన వీసీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లోని మెకానికల్ మరియు సివిల్ ఇంజనీరింగ్ కు సంబంధించిన ల్యాబ్ లను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రారంభించారు. బుధవారం యూనివర్సిటీ ఇంజనీరింగ్ వర్క్ షాప్ భవనంలో ఏర్పాటు చేసిన మెకానికల్ అండ్ సివిల్ ఇంజనీరింగ్ ల్యాబ్స్ ను వీసీ జగన్నాథరావు ప్రారంభించి పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధ్యాపకులను, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రూ. 1.5 కోట్లతో మెకానికల్ అండ్ సివిల్ ఇంజనీరింగ్ ల్యాబ్ పరికరాలను ఏర్పాటు చేసామన్నారు. ఇంజనీరింగ్ కోర్సుకు అవసరమైన 16 ల్యాబ్స్ పరికరాలు అన్నింటిని సమకూర్చామని చెప్పారు. ల్యాబ్స్ లోని పరికరాలను సమర్థవంతంగా ఉపయోగించుకున్నప్పుడే వాటి విలువ పెరుగుతుందని, విద్యార్థులకు విజ్ఞానం అందుతుందని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ సంయుక్తంగా రిసెర్చ్ వర్క్ చేయాలని సూచించారు. సివిల్ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ ఏర్పాటు చేయాలని తెలియజేసారు. విద్యార్థులు ల్యాబ్స్ ను పూర్తి స్థాయిలో ఉపయోగించుకొని విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని, ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. తరువాత కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అభివృద్ధికి వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఎంతో కృషి చేసారని కొనియాడారు. ఇంజనీరింగ్ కాలేజ్ కి ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపు తీసుకురావడం, ఇంజనీరింగ్ వర్క్ షాప్ భవనాన్ని నిర్మించడం, ల్యాబ్స్ లను అభివృద్ధి పరచడం వంటి ప్రగతి జగన్నాథరావు నాయకత్వంలో జరిగిందని తెలియజేసారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయానికి నాక్ బి ప్లస్ గ్రేడ్ సాధించిన సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు నాక్ బి ప్లస్ కేక్ ను వీసీ జగన్నాథరావు చేతుల మీదుగా కట్ చేయించి ఆనందాన్ని, అభిమానాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.పెర్సిస్, డా.కె.సుబ్బారావు, కోర్సు కోఆర్డినేటర్స్ సి.హెచ్.శ్రీవర్మ, పి.లక్ష్మీ అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలు యువతకు మార్గదర్శకం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ

భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు యువతకు మార్గదర్శకం కావాలని, అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషిచేసినప్పుడే నిజమైన నివాళులు అర్పించినట్లవుతుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. అంబేద్కర్ 66వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీ డా.బి.ఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా భారతదేశానికి చక్కని రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ ఆశయాలు ఎంతో ఉన్నతమైనవి అన్నారు. భారతీయ న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా డా. బాబాసాహెబ్ అంబేద్కర్ దేశాభివృద్ధికి విశేష కృషి చేసారన్నారు. అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారన్నారు. కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి., లండన్ విశ్వవిద్యాలయం నుండి డి.ఎస్.సి (డాక్టరేట్) పట్టాలను పొంది చాలా అరుదైన గౌరవాన్ని సంపాదించుకున్నారని చెప్పారు. ప్రపంచ మేధావిగా కీర్తించబడుతున్న అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలన్నారు. ఆయన ఆశయాలకు కృషి చేయడమే నిజమైన నివాళి అని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ఎస్సీ ఎస్టీ కోఆర్డినేటర్ డా.పి.విజయనిర్మల, డీన్ డా.పి.వెంకటేశ్వరరావు, డా.ఎం.గోపాల కృష్ణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీబనానంద దాస్

*(1899 - 1954)*



బెంగాలీ సాహిత్యంలో రవీంద్రుని తర్వాత వారు వేసిన మార్గాన్ని మరింత ప్రతిభావంతంగా నిలబెట్టిన కవి జీబనానంద దాస్. రవీంద్రుని తదనంతరం ఆయన ప్రభావం నుంచి బయటపడేందుకు బెంగాల్ కవులు పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. అభ్యుదయ కవులు కొంతవరకు విజయం సాధించి సొంత గొంతుల్ని ఎత్తి పెట్టారు. రవీంద్రుని ప్రభావం నుంచి బయటకు రావడానికి ఇష్టపడని జీబనానంద దాస్ రవీంద్రుని సంప్రదాయాన్ని అద్భుత కవితా శక్తితో బలమైన భావవ్యక్తీకరణతో ముందుకు తీసుకెళ్లారు. ఆ ఇమేజరీలు ఉక్కిరిబిక్కిరి చేసే కవితా ధార చక్కని పదబంధాలు ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటాయి. ఇప్పటికీ బెంగాల్ కవిత్వం మీద జీబనానంద ముద్ర కొనసాగుతూనే ఉంది. తరచుగా కనిపించే బనలతాసేన్ కవిత దాదాపుగా రవీంద్రుని గీతాంజలి ఎన్ని భాషల్లోకి ఎన్ని అనువాదాలు పొందిందో జీవనానంద దాస్ ' ' బెంగాల్ నీలి ఆకాశపు అంచుల్లో... సంకలనం అంత గొప్ప సంచలనం కలిగించింది.

తాను జీవించిన కాలంలో ముప్పిరిగొన్న సామాజిక సంక్షోభ పరిస్థితుల మధ్య

## ప్రతిభావాణి

కలకత్తా వీధుల్లో సంచరిస్తూ తాను పుట్టి పెరిగిన బంగ్లాదేశ్ బంగ్లాదేశ్ సరిహద్దు గ్రామాల్లో తిరుగాడుతున్నట్టు భావిస్తూ రాసిన ఈ కవిత్వంలో జీవన మరణ వేదనలతో పాటు గత వర్తమాన భవిష్యత్తు కాలాల హృదయ స్పందనల్ని జీబనానంద్ నింపారు. అన్ని జీవన సామాజిక పరిష్కాలలో అత్యున్నత స్థాయిని అందుకున్న బెంగాలీ సాహిత్య ప్రపంచములో కల్లోల కాలంలో సైతం రవీంద్రుని అడుగుజాడలని వదలని అత్యున్నత సౌందర్యాత్మక ప్రకటన జీబనానంద్ గారిది. బెంగాలీ గ్రామీణ సౌందర్యంతో పాటు మధ్యతరగతి ఆధునిక మానవుడి జీవన సంవేదనని రవీంద్రుని కంటే బలంగా ఎలుగెత్తిన వారు అని అతని సమకాలికులైన బుద్ధదేవ్ బోస్, బిష్ణుడేలా ప్రశంసించారు.

నగరాలకు వలస వచ్చి జన్మభూమి కోసం తపించే నాగరికల గాయపడ్డ ఆత్మగానాలని జీబనానంద కవిత్వం వినిపిస్తుంది. ఆ పదాల రహదారుల సవ్వడుల మీదుగా గుండెల్ని గ్రామ సీమలకు పరితపిస్తూ పరిగెత్తేలా చేస్తుంది.

జీవనానంద్ దాస్ మరణించిన తర్వాత ఒక ఎక్సర్సైజ్ నోట్ బుక్ లో ఆయన రాసుకున్న 62 కవితల్ని గుర్తించి రూపసీ బంగ్లా పేరుతో ప్రచురించిన కవితా సంకలనం గొప్ప సంచలనం కలిగించింది. ఈ కవితలన్నింటినీ ఆయన మరణించడానికి 20 ఏళ్ల ముందే అంటే 1934లో రాసినట్లు గుర్తించారు. ఈ సంకలనంలోని కవితలు వస్తురీత్యా ఆధునిక పద సౌందర్యం దృష్ట్యా ఆయన తర్వాత రాసిన కవితలు అన్నింటికన్నా మేలైనదిగా ప్రశంసలు అందుకున్నాయి. విలక్షణమైన గొంతుతో నిండిన కవిత్వం ద్వారా బెంగాలీ సాహిత్యంలో రవీంద్రుడు సరసన జీవనానంద్ ని నిలబెట్టవచ్చును.

**- కుప్పిలి పద్మ**



శివకిరణ్ ను సన్మానిస్తున్న విశ్వవిద్యాలయ అధికారులు

# వ్యవస్థాపక లక్షణాలను పెంపొందించుకోండి

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మరియు అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ సహకారంతో "సృజన షిబిర్" ఒక రోజు వ్యవస్థాపక సంసిద్ధత శిబిరాన్ని నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఈ శిక్షణ శిబిరానికి కావల్సిన వనరులను సమకూర్చి విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డా. శివకిరణ్ మాట్లాడుతూ ఎంట్రప్రెన్యూర్షిప్ రెడినెస్ కు సంబంధించిన వివిధ అంశాలను ప్రస్తావించారు. విద్యార్థులు అడిగిన వ్యవస్థాపక సందేహాలను నివృత్తి పరిచి వారిలో వ్యవస్థాపక లక్షణాలను పెంపొందించే దిశగా సందేశాన్నిచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా వ్యవస్థాపక లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం శివకిరణ్ ను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వి. పెర్సిస్, ఈసీ మెంబర్ డా. బి. జగన్మోహనరెడ్డి, డీన్ ఆచార్య పి. సురేష్ వర్మ, ఆచార్య కె. రమణేశ్వరి, కో. కన్వీనర్లు డా. డి. అప్పలరాజు, డా. పద్మవల్లి, డా. వై. సుష్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక అభివృద్ధిలో పౌర విమానయానం పాత్ర కీలకం

## - టెర్మినల్ మేనేజర్ నంబి ఆత్రేయబాబు



నంబి ఆత్రేయబాబును సన్మానిస్తున్న ఆచార్యులు

పర్యాటక అభివృద్ధిలో పౌర విమానయానం పాత్ర ఎంతో కీలకమైనదని రాజమండ్రి విమానాశ్రయ టెర్మినల్ మేనేజర్ నంబి ఆత్రేయబాబు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో గురువారం "సుస్థిర పర్యాటక అభివృద్ధి కోసం పౌర విమానయానం పాత్ర" అనే అంశంపై గెస్ట్ లెక్చర్ ను నిర్వహించారు. కీలకో పన్యాసకులుగా విచ్చేసిన నంబి ఆత్రేయబాబు మాట్లాడుతూ పౌర విమానయానం, పర్యాటకం రంగాలు సరస్పర అభివృద్ధి దోహదపడతాయని, ప్రపంచ వ్యాప్తంగా వీటి జిడిపి కూడా అధికంగా ఉంటుందన్నారు. కోవిడ్ కారణంగా కొన్ని సమస్యలు పర్యాటక రంగంలో వచ్చా యన్నారు. ఏ ప్రాంతంలోనైన పర్యాటక రంగం అభివృద్ధి చెందాలంటే పౌర విమానయానం పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన సాఫ్ట్ పవర్ ను పెంపొందించడంలో పౌర విమానయానం ప్రధాన పాత్రను పోషిస్తుందన్నారు. పౌర విమానయానం మరియు పర్యాటక రంగాలు పరస్పరం అభివృద్ధిని సాధిస్తాయని తెలియజేసారు. సుస్థిర పర్యాటక అభివృద్ధి కోసం పౌర విమానయానం పాత్రపై చక్కని సందేశానిచ్చిన నంబి ఆత్రేయబాబును విభాగాచార్యలు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి ఆచార్య ఎస్. టేకి, విభాగాధ్యాపకులు డా. ఎన్. ఉదయభాస్కర్, డా. జి. రాజేంద్రప్రసాద్, డా. ఎం. రమేష్, డా. జి. అలీస్ జాయ్, డా. ఐ. ఎస్. ఎన్. రాజు, జె. రవిశంకర్, డా. ఎం. అమ్మిరెడ్డి పాల్గొన్నారు.



రాష్ట్రపతి భవన్ లో ఎన్.సి.ఎస్.టి ప్రతినిధులతో నన్నయ అధ్యాపకులు

# రాష్ట్రపతి భవన్‌లో ట్రైబల్ సదస్సుకు హాజరైన రిజిస్ట్రార్

న్యూఢిల్లీలోని విజ్ఞానభవన్, ఐ.ఐ.టి మరియు రాష్ట్రపతి భవన్ లో జరిగిన "జంజాతీయ అనుసంధన్ : అస్మిత, అస్తిత్వ, ఏవం వికాస్" అనే అంశంపై జరిగిన జాతీయ కార్యశాలలో నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, విద్యావిభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఆర్. ఎస్. వరహాలదొర, మేనేజ్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎల్. మధుకుమార్ లు హాజరయ్యారు. దీనికి సంబంధించిన వివరాలను రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ తెలియజేస్తూ నవంబర్ 27, 28 తేదీలలో నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ ఆధ్వర్యంలో కార్యశాల జరిగిందన్నారు. 27వ తేదీన విజ్ఞానభవన్ న్యూఢిల్లీలో తొలిరోజు కార్యశాల జరిగిందని, 28వ తేదీ ఉదయం ఐఐటి న్యూఢిల్లీలో కార్యక్రమాలు జరిగాయన్నారు. మధ్యాహ్నం రాష్ట్రపతి భవన్, మ్యూజియం, మొగల్ గార్డెన్స్ లను సందర్శించామని అనంతరం రాష్ట్రపతి భవన్ లో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, ఎన్.సి.ఎస్.టి చైర్ పర్సన్ శ్రీ హర్ష చౌహాన్ లు హాజరై "ట్రైబల్ హీరోస్ ఇన్ ఇండియన్ ఫ్రీడమ్ స్ట్రగుల్" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారని తెలిపారు.

# ఇంజనీరింగ్ ఇండక్షన్ ప్రోగ్రామ్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో ఇండక్షన్ ప్రోగ్రామ్ ను నిర్వహించారు. ఎ.ఐ.సి.టి.ఇ. నిబంధనల ప్రకారం ఇంజనీరింగ్ పాఠ్యాంశాలలో భాగంగా ఇండక్షన్ ప్రోగ్రామ్ ను డిపార్టమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా. పి. వెంకటేశ్వరరావు జెండాను ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇంజనీరింగ్ పాఠ్యాంశాలలో భాగంగా ప్రతి ఏడాది మొదటి సంవత్సరం బి.టెక్ విద్యార్థులను ఇండక్షన్ ప్రోగ్రామ్ కు తీసుకువెళ్తామని చెప్పారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం సిటీ, ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్, కడియపులంక నర్సరీలను సందర్శిస్తారని తెలియజేసారు. 115 మంది విద్యార్థులు, అధ్యాపకులు విశ్వవిద్యాలయం బస్సులలో పలు ప్రాంతాలను సందర్శిం చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ డా. కీర్తిమరిట, డా. బాలకృష్ణ, డా. వెంకట్రావు, డా. శిరీష పాల్గొన్నారు.




ఇండక్షన్ ప్రోగ్రామ్ కు వెళుతున్న నన్నయ విద్యార్థులు



క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ ను ప్రారంభిస్తున్న వీసీ

## నన్నయ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ సెల్ మరియు బెస్ట్ కెరీర్స్ సంయుక్తంగా నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ కు విశేష స్పందన వచ్చింది. గురువారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులంతా ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన ప్రతీ విద్యార్థి ఉద్యోగాలు చేస్తూ తల్లిదండ్రులకు భరోసాగా నిలవాలన్నారు. ప్రతీ ఉద్యోగంలోను అనుభవాన్ని సంపాదించుకొని, ఉన్న స్థానం నుండి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. బెస్ట్ కెరీర్స్ సహకారంతో విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ కు కాప్ జెమిని (CAPGEMINI), డెలాయిట్ (DELOITTE) కంపెనీలు వచ్చాయన్నారు. వంద ఉద్యోగావకాశాలకు సంబంధించి 652 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఉద్యోగాల కొరకు హాజరైన అభ్యర్థులకు పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి ప్రతిభ కనరపచిన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ. ఐదు నుండి ఏడు లక్షలలో వేతనాలు ఉంటాయని తెలియజేసారు. త్వరలో మరిన్ని క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ లను నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన వారు విశ్వవిద్యాలయానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, మిగిలిన వారు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. తరువాత అతిథులను, హెచ్.ఆర్. లను సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. అనంతరం అభ్యర్థులకు పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ కనపరచిన వారిని ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో ప్లెస్మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య పి.సురేష్ వర్మ, ప్లెస్మెంట్ ఆఫీసర్ డా.బి.జగన్మోహనరెడ్డి, బెస్ట్ కెరీర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.రమణ, కాప్ జెమిని హెచ్.ఆర్. మేనేజర్ ఎం.సందీప్, సంస్థల ప్రతినిధులు విజయ్, పి.కిషోర్ కుమార్, నవీన్, బి.రాజు మరియు విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## మల్లాడి శివరాం నాయకర్ పేరుమీద సెమినార్ హాల్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు మల్లాడి శివరాం నాయకర్ పేరు మీదుగా సెమినార్ హాల్ ను ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ మొక్కా జగన్నాథరావు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. ఎం. కమల కుమారి, ఆచార్య ఎస్. ప్రశాంతిశ్రీ, శివరాం నాయకర్ సతీమణి మల్లాడి చంద్ర కుమారి, ఎం ఎస్ ఎన్ చారిటీస్ ట్రస్ట్ మెంబర్ పొన్నమండ విజయ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎండోమెంట్స్ డిపార్ట్మెంట్ ఏ. బాబూరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి జగన్నాథరావు మాట్లాడుతూ మహాదాత సత్య లింగ నాయకర్ గారు విద్యాభివృద్ధి కోసం ఇచ్చిన ఈ స్థలాన్ని తరతరాలుగా పరిరక్షిస్తూ ఎం.ఎస్.ఎన్ చారిటీస్ తరఫున ఎప్పుడు యూనివర్సిటీ తమ సహాయ సహకారాలతో పాటు , నిరంతర అభివృద్ధికి కృషి చేసినటువంటి మల్లాడి శివరాం నాయకర్ పేరు మీదగా సెమినార్ హాల్ ఏర్పాటు చేయడం నిజంగా హర్షదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్యాంపస్ లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించిన వీసీ కి క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం. కమల కుమారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమానికి హాజరయిన శివరాం నాయకర్ సతీమణి శ్రీమతి మల్లాడి చంద్రకుమారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డా. ఎం. పోచయ్య విభాగాధిపతులు , బోధన బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆచార్య నాగార్జున లేఖలు







ఆచార్య నాగార్జునడు పేరు అందరూ వినే ఉంటారు. ఆంధ్రుడని, గుంటూరు జిల్లా వాడని ఎంతో మమకారంతో మన జలాశయానికి నాగార్జునసాగర్ అని, విశ్వవిద్యాలయానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అని నామకరణం చేసుకున్నాం. అయితే మనకు తెలియక ముందే సుదూర తీరాలలో ఉన్న చైనా, టిబెట్, కొరియా, జపాన్ వారికి బాగా తెలుసు. మన పొరుగునే ఉన్న నేపాల్, భూటాన్, సిక్కిం దేశాల వారికి తెలుసు. మహాయానాన్ని అనుభవించే దేశాల వారందరికీ తెలుసు. తెలియడమే కాదు, వారందరూ నాగార్జునని ఒక మహా త్మునిగా, బోధిసత్వనిగా, మరో బుద్ధునిగా ఆదరించడమే కాక ఆరాధిస్తారని బౌద్ధ ధర్మానుసారులకు, బౌద్ధ సాహిత్య విద్యార్థులకు, బౌద్ధ సంస్కృతి అన్వేషకులకు తెలుసు. ఎందరో మహాయాన శ్రద్ధాలువులు నాగార్జునుడు జన్మించిన భారతదేశాన్ని, నడయాడిన ధాన్య కటకాన్ని,విహరించిన శ్రీ పర్వతాన్ని (నాగార్జునకొండ) పవిత్ర ప్రదేశాలుగా, యాత్ర స్థలాలుగా పరిగణించుకొని ఒకసారి వాటిని దర్శించగలిగితే జన్మ ధన్యమవుతుందని, నిర్వాణం అందుకోగలమని విశ్వసిస్తూ, ఆ అవకాశం కోసం ఎదురుచూస్తూ హృదయాంతరాలలో నాగార్జునని మూర్తిమత్వాన్ని నిలుపుకొని పారాయణం చేస్తూ ఉంటారు. నాగార్జునని సుహృల్లేఖ భారతదేశంలో భారతీయ భాషలలో లభ్యం కావడం లేదు. అనువాద రూపంగా చైనా, టిబెట్ భాషలలో లభిస్తుంది. వాటిని వందేళ్ల క్రితమే ఆంగ్ల భాషలోకి అనువదించడం జరిగింది. దానిని తెలుగులోకి అనువదించే సాహసం చేసిన వారు డాక్టర్ వావిలాల సుబ్బారావు గారు. వారి అనువాదమంతా సామాన్య పరిభాషలోకి సాగింది. ఈ అనువాద ప్రేరణతో బౌద్ధ పరిభాషాభినివేశం ఉన్న వారు ఎవరైనా బౌద్ధ స్వభావ ధర్మాన్ని వెల్లడించేలాగా ఆ ప్రయత్నం చేయవచ్చు.

తొలి తెలుగు అనువాదాన్ని వీలైనంత సరళంగా వ్యవహారిక భాషలోకి అందించే ప్రయత్నం ఈ పుస్తకంలో జరిగింది. అమరావతి వాస్తవ్యుడైన ఈ అనువాదకులు తనకున్న నాగార్జున మీద అభిమానాన్ని ఈ విధంగా వ్యక్తం చేయడం అభినందనీయం. సుహృల్లేఖ, రత్నావళి, శిష్యలేఖలు ఇందులో ఉన్నాయి. అమరావతిలోని ధాన్యకటక బుద్ధ విహార ట్రస్ట్ దీనిని ప్రచురించడం ద్వారా తెలుగు వారందరికీ నాగార్జునుని రచనలు తెలుగులో చదివే అవకాశం లభించిందని నేను భావిస్తున్నాను.

**- ఎం. రాజగోపాలరావు, ధరణికోట.**

## అకడమిక్స్,నానోటెక్నాలజీపై సదస్సు




తాడేపల్లిగూడెంలోని ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ క్యాంపస్‌లో 2022 డిసెంబర్ 6-7, 2022 తేదీలలో "అకడమిక్స్ మరియు నానోటెక్నాలజీపై ప్రత్యేక దృష్టితో పరిశోధన మరియు అభివృద్ధి దిశగా ఒక అడుగు" అనే అంశంపై రెండు రోజుల సెమినార్ ప్రారంభమైంది. క్యాంపస్ ప్రిన్సిపల్ ఆచార్య కె. శ్రీరమేష్ ప్రారంభించారు. మాజీ చీఫ్ సైంటిస్ట్ ఎన్.పి.ఎల్ న్యూఢిల్లీ మరియు ఐఐఐటి ఇడుపులపాయ, కడప మాజీ డైరెక్టర్ ఆచార్య జి. భగవన్నారాయణ ముఖ్య అతిథిగా మరియు రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. శశి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎండి. ఇస్మాయిల్, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ సరోజ పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు రిసోర్స్ పర్సన్ ప్రొ. జి. భగవన్నారాయణ నానోఫిల్మ్‌లు, మల్టీలేయర్‌లు, కార్బన్ నానోట్యూబ్‌లు, క్వాంటం డాట్‌లు మరియు వాటి నిర్మాణాలతో సహా నానో మెటీరియల్స్ సింథసిస్ యొక్క అవలోకనాన్ని చర్చించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బి.ఫార్మసీ, సి.ఆర్. రెడ్డి కళాశాల ఏలూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెంటపాడు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు. కోర్సు కోఆర్డినేటర్లందరూ పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం కోర్స్ కోఆర్డినేటర్ మరియు కన్వీనర్ డా. కె. ఎఫ్రాయిముబాబు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ కె. శ్రీరమేష్ మరియు రిసోర్స్ పర్సన్ భగవన్నారాయణ లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in